ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
బుధవారం | 7 మే 2025 | 12 పేజీలు

12




## స్వయం ఉపాధికి కార్యాచరణ వేగవంతం చేయాలి

■ రాజీవ్‌యువ వికాసం పథకంపై అధికారులతో సమీక్షా సమావేశంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

■ బాల్యానికి మూడు 'ముళ్లే'...
■ బడికెళ్లాల్సిన వయసులో పెళ్లి పీటలెక్కుతున్న బాలికలు
■ పెరిగిపోతున్న బాల్య వివాహాలు..
■ 10నెలల్లో 96 వివాహాలను అడ్డుకున్న అధికారులు..
■ తెలియకుండా జరుగుతున్నవి ఎన్నో..
■ పేదరికం, అవగాహనా రాహిత్యంతో ఆగని బాల్య వివాహాలు..





వివరాలు 8లో

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
■ గుట్టుచప్పుడు కాకుండా పెళ్లిళ్లు

# పసితనానికి.. పలుపు తాడు.!

ఒక రాధమ్మ పదహారేళ్లు కూడా నిండకముందే, విడాకుల కేసులో కోర్టు మెట్లు ఎక్కుతుంది. ఒక పద్మావతి పదమూడేళ్లకే ఇద్దరు పిల్లల తల్లి అనిపించుకుంటుంది. ఒక అక్షితమ్మ పద్దెనిమిదేళ్ల ప్రాయంలో భర్తను కోల్పోయి ఒంటరి జీవితం గడుపుతుంది. ఒక సరస్వతీ చదువు ఐదోతరగతితో ఆగిపోతుంది.. ఒక మరియమ్మ జీవితం ఆత్మహత్యతో ముగుస్తుంది. ఇన్ని సంక్షోభాలకు కారణం. బాల్య వివాహాలే. పుస్తకాల సంచి భుజానికేసుకుని బడికెళ్లాల్సిన వయసులో చంకలో ఓ పసిబిడ్డ. మనసు వికసించాల్సిన దశలో.. ఒత్తిళ్లూ ఆత్మహత్య ఆలోచనలు.. పచ్చగా కాపురం చేసుకోవాల్సిన సమయానికి.. విడాకులూ వైధవ్యాలు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాలు, గూడేల్లో బాల్య వివాహాలు ఆడపల్లల జీవితాల్ని బుగ్గిపాలు చేస్తున్నాయి. బాల్యవివాహాలపై 'ప్రభాత సమాచారం' ప్రత్యేక కథనం

*- ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి*



2

## అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

■ రూ.27 లక్షల విలువ చేసే 27 ఆటోలు, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం
■ ఏడుగురి అరెస్టు, కేసు నమోదు ■ పరారీలో ఇద్దరు ప్రధాన నిందితులు..
■ ఆటోలను దొంగిలించి.. నకిలీ నెంబర్లు మార్చి విక్రయిస్తున్న దొంగల ముఠా
■ వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లాలో తరచుగా ఆటోలను దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతరాష్ట దొంగల ముఠా వివరాలను ఆయన వెల్లడించారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఆటోలో వెలుతున్న షారుక్ పఠాన్ విచారించచగా ఏడుగురు ముఠా సభ్యులు అందరూ కలిసి హైదరాబాద్, ఆదిలాబాద్‌లో ఆటోలను దొంగలించి వాటి వాహన నంబర్లు, ఇంజన్ నంబర్లు మార్చి, వాటి స్థానంలో నకిలీ నంబర్లు ముద్రించి విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## తప్పుడు లెక్కలపై విచారణ జరపాలి

■ స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీరుతో రైతులకు నష్టం
■ పత్తి కొనుగోళ్లపై మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం

రాష్ట ప్రభుత్వ అసమర్థత కారణంగా పత్తి రైతులు నిలువునా మోసపోయారని మాజీ మంత్రి జోగురామన్న ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే హస్తంతో ప్రైవేట్ డీలర్లతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని పత్తి రైతులకు కుచ్చుటోపీ పెట్టారని ఆయన ఆరోపించారు.





7

## పార్టీ విధేయులకు త్వరలో పదవులు

■ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
■ అర్హులైన వారికి పదవులొస్తాయ్..
■ యువత, మహిళలను రాజకీయంగా ముందుకుతీసుకొస్తాం
■ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి..
■ టీపీసీసీ పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి

కాంగ్రెస్ పెద్దలు, ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని టీపీ సీసీ రాష్ట పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని సోమగూడెంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికో వారసున్ని కాంగ్రెస్‌లోకి సైనికులా పంపించాలని పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ జెండా మోసి పార్టీకి సేవ చేసిన వారికి పదవులు దక్కుతాయని తేల్చి చెప్పారు.



## ప్రాణం తీసిన తేనెటీగలు

■ గోలేటి-1 ఇంక్లైన్ వద్ద తేనెటీగ దాడి..
■ తేనెటీగల దాడిలో తాపీమేస్త్రీ మృతి
■ మరో ముగ్గురు కార్మికులకు గాయాలు

## తాగు నీటి సమస్యపై తక్షణమే స్పందించాలి

■ ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీటిని అందించాలి
■ అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
■ కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే





## 27 ఆటోలు దొంగిలించిన
# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

■ రూ.27 లక్షల విలువ చేసే 27 ఆటోలు, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం ■ ఏడుగురిపై కేసు నమోదు
■ పరారీలో ప్రధాన నిందితులు ■ ఆటోలను దొంగిలించి.. నెంబర్లు మార్చి విక్రయిస్తున్న ముఠా
■ వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో తరచుగా ఆటోలను దొంగతనం చేస్తున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతరాష్ట్ర దొంగల ముఠా వివరాలను ఆయన వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన సమయంలో నిందితుడు ఏ-3 షారుక్ పఠాన్ ఆదిలాబాద్‌లో దొంగలించిన ఆటోతో అనుమానస్పదంగా పట్టుబడ్డాడని, అతనిని ఆపి విచారించగా ఏడుగురు ముఠా సభ్యులు అందరూ కలిసి హైదరాబాద్, ఆదిలాబాద్ లో ఆటోలను దొంగలించి వాటి వాహన నంబర్లు ఇంజన్ నంబర్లు మార్చి, వాటి స్థానంలో కొత్త నకిలీ నంబర్లు ముద్రించి విక్రయిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. ఇందుకు సిద్ధంగా ఉన్న సమయంలో జిల్లా పోలీసులు వారిని పట్టుకొని కేసును ఛేదించారని తెలిపారు. ఏ-3 షారుక్ పటాన్ ను విచారించిన సందర్భంలో నిందితుడు ఏ-4 అల్తాఫ్ ఖాన్ వద్దకు తీసుకు వెళ్ళగా, అక్కడ ఏ-5 షేక్ ఖయ్యూం, 15 ఆటోలు వీరిద్దరి వద్ద లభ్యమయ్యాయని తెలియజేశారన్నారు. తదుపరి వీరందరూ ఏ-6 అప్సర్ బేగ్, ఏ-7 అసద్ ఖాన్ ఇంటి వద్దకు తీసుకు వెళ్ళగా వారి వద్ద 11 ఆటోలు లభ్యమయ్యాయని తెలియజేశారు. వీరిపై హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 6 కేసులు నమోదు అయి ఉన్నాయని తెలిపారు. ఈ ఐదుగురు ప్రధాన నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న ఏ-1 యూసఫ్, ఏ-2 సయ్యద్‌ల పథకం ప్రకారం ఆటోలను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో దొంగలించి, వాటిని ఇక్కడికి తీసుకొచ్చి అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితులను పట్టుకోవడంలో జిల్లాలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, త్వరలో వారిని పట్టుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, దొంగలను పట్టుకోవడంలో జిల్లా పోలీసు యంత్రాంగం ముందు ఉంటుందని, జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పిస్తుందని అన్నారు. మొత్తం వీరందరి వద్ద 27 ఆటోలను స్వాధీనం చేసుకోగా, వీటి విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు 27 లక్షల వరకు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ కే ఫణిందర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ముజాహిద్ ను, సిసిఎస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫణిధర్, సీసీ ఎస్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై సయ్యద్ ముజాహిద్, రూరల్ పోలీసు మరియు సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**వాహనాలు కొనే ముందు జాగ్రత్తలు పాటించాలి...**
ఎవరైనా పాత వాహనాలను అమ్మకానికి వచ్చినపుడు ఆ వాహనం ఒరిజినల్ ఆర్ సిని చూసి దానిలో ఉన్న ఆర్‌సి



నంబరు, ఇంజన్ నెంబర్‌లను సరిచూసుకొని అమ్మేవారు వాహన యజమాని అని ధృవీకరించుకున్న తర్వాత మాత్రమే వాహనాలను కొనుగోలు చేయాలని, వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పేపర్స్ లేకుండా కొనుగోలు చేయవద్దని, దొంగిలించిన వాహనాలను కొని ఆర్థికంగా నష్టపోవడంతో పాటు క్రిమినల్ కేసులు ఎదుర్కోవలసి వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.



## పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

■ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్
■ ధర్మారం, లక్ష్మణచందా, రాచాపూర్, వడ్యాలలో మౌలిక సదుపాయాల పరిశీలన

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**
వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులను అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ మంగళవారం పరిశీలించారు. లక్ష్మణచందా మండలంలోని ధర్మారం, లక్ష్మణచందా, రాచాపూర్, వడ్యాల గ్రామాలలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వరి కొనుగోలు చేయాలన్నారు. నిర్దేశిత తేమ శాతం వచ్చిన తరువాత మాత్రమే తూకం చేయాలని, ఒక్క గ్రాము కూడా అధికంగా తూకం చేయొద్దని అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులకు టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి సరైన రికార్డు సిద్ధంచేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో నూతన బార్

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రా పద్ధతిలో ఎంపికైన లబ్దిదారుడికి అనుమతి జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆబ్కారీ శాఖ పర్యవేక్షకుడు నందగోపాల్, ఎక్సైజ్ సి.ఐ. గురువయ్యలతో కలిసి డ్రా పద్ధతిలో లబ్దిదారుడిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్




స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రాలో గంద్ర దీక్షిత్ రావు లబ్దిదారుడిగా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రసాభాస



**మాజీ ఎమ్మెల్యేల వర్గీయుల మాటల యుద్ధం**

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**
ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు.. అంతర్గత పోరు మరోమారు రచ్చకెక్కింది.. భైంసా పట్టణంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. పీసీసీ పరిశీలకులు రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ గౌడ్, ఎండి అవేజ్‌ల ముందే ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్ వర్గాల కార్యకర్తల మధ్య మాటల యుద్ధం నడిచింది. సుమారు దాదాపు గంటసేపు వాగ్వాదం కొనసాగగా చివరకు నాయకులు భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, నాయకులు శంకర్ చంద్రే కలుగజేసుకొని ఇరు వర్గాలకార్యకర్తలను శాంతింపచేయగా సమావేశం సజావుగా కొనసాగింది. అయితే పార్టీ కష్టకాలంలో జెండా పట్టుకుని నడిచిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదని నారాయణరావు పటేల్ వర్గీయులు ఆరోపించారు. చివరికి మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్ రెడ్డి, వేణుగోపాల చారి తామంతా ఒకటేనని కలిసికట్టుగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ పార్టీకి విజయాలను సైతం అందిస్తామన్నారు.

## మినీ అంగన్వాడీలకు
# ప్రమోషన్
### ఇకపై అందరూ అంగన్వాడీ టీచర్లే

**ఆదిలాబాద్ ప్రతినిధి, మే 6 (ప్రభాత సమాచారం)**
మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3989 మంది మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇకపై మినీ అంగన్వాడీ టీచర్లు కూడా మెయిన్ అంగన్వాడీ టీచర్లతో సమానంగా వేతనం అందుకోనున్నారు. ఇన్నాళ్లుగా మినీ అంగన్వాడీ, మెయిన్ అంగన్వాడీ అనే వేతన వ్యత్యాసం ఉండేది. అయితే, ఈ తాజా నిర్ణయంతో ఆ తేడా ఇకపై తొలగిపోనుంది. అందరూ ఇకపై అంగన్వాడీ టీచర్లుగానే పిలువబడతారు. సాంకేతికపరమైన సమస్యలు, అలాగే కొన్ని న్యాయపరమైన చిక్కుల కారణంగా ఈ ప్రక్రియ ఇంతకాలం ఆలస్యమైందని ప్రభుత్వం తెలిపింది. అయితే, అన్ని అడ్డంకులను అధిగమించి ఈ నెల నుంచే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. అంతే కాకుండా, మే నెల నుంచి మినీ అంగన్వాడీ టీచర్లకు క్రమం తప్పకుండా నెలకు రూ.13,650 వేతనం అందనుంది. గతంలో మినీ అంగన్వాడీ టీచర్లకు నెలకు కేవలం రూ. 7800 మాత్రమే వేతనంగా వచ్చేది. ఈ పెంపుతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడనుంది. ఎలాంటి సమస్యలు లేకుండా ఈ విషయాన్ని పరిష్కరించి, ఇక నుంచి తమకు ప్రతి నెలా మెయిన్ అంగన్వాడీ టీచర్ల మాదిరిగానే వేతనాలు అందేలా కృషి చేసిన మంత్రి సీతక్కకు మినీ అంగన్వాడీ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సదానందం ఆధ్వర్యంలో కమి టీ సభ్యులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని కన్నాల హైవేను అనుకొని ఉన్న జర్నలిస్టు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసిన స్థలాన్ని కాపాడాలని సంబంధిత స్థలాన్ని అర్హులైన విలేకరులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు చెందిన స్థలంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల పోల్స్‌పాతి, కబ్జా చేసిన విషయంను స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతో విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ స్థానిక తహసీల్దార్‌తో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## బెల్లంపల్లి నియోజకవర్గంలో
# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- అర్హులైన ప్రతీ ఒక్కరి సంక్షేమ ఫలాలు
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య
- అభివృద్ధి, సంక్షేమ పనులను శంకుస్థాపన..
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి..




**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాండూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరు రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఏ సమయంలో అయినా తన ఇంటి తలుపు తట్టి సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రజిత, టీపీసీసీ సభ్యుడు శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నియోజవకర్గాన్ని అభివృద్ధి చేస్తా...**
బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం కన్నెపల్లి మండలంలో పర్యటించారు. సుర్జాపూర్ గ్రామంలో రూ. 1.20 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును, ఎల్లారంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. జన్కాపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి, భీమిని మండలాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లారం గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారులతో



కలిసి భోజనం చేశారు. అనంతరం కన్నెపల్లి మాజీ జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాధ్యక్షులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



**ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య...**
ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పూర్తిస్థాయి వసతులు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోస్తు వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కాంపెల్లి శంకర్‌బీ అధ్యాపకులు తిరుపతి, ప్రవీణ్‌కుమార్, గజెల్లి మోహన్ పాల్గొన్నారు.



## కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లిలో కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని నెంబర్-2 ఇంక్లైన్ బస్తీలోని గోల్‌బంగ్లా స్మశాన వాటిక సమీపంలో రెండు సంవత్సరాల జింక పిల్ల మృతి చెందింది. తీవ్రంగా గాయపడి ఉన్న జింక కుక్కల దాడిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఐటీడీఏ తోట నుంచి జింక పిల్లలు గోల్‌బంగ్లా స్మశాన వాటిక వైపువస్తుంటాయని, ఇదే క్రమంలో జింక పిల్ల కుక్కల దాడికి గురైంది.

## విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**
పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి భవిష్యత్ లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ అన్నారు. మంగళవారం భైంసాలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్య అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన అన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల ప్రాథమిక జాబితాను పరిశీలించాలి

- అర్హుల ఎంపిక ప్రక్రియను పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రాథమిక జాబితాలులో ఉన్న పేర్లను మరోసారి వెరిఫికేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని కే.ఆర్.కే కాలనీ, రామ్ నగర్, భాగ్యనగర్ లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో బుధవారం ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను, ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. అన్ని కోణాల్లో పరిశీలించి లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అంతకుముందు గూగుల్ మీట్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించి మొత్తం 6,886 అప్లికేషన్ల ధృవీకరణ పూర్తయిందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఆదేశించారు. వారు అర్హులని తేలితే ప్రతిపాదనల్లో ప్రతిపాదనల్లో చేర్చాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

తాంసి మండలంలోని హస్నాపూర్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ పరిశీలించారు. అర్హులైనప్పటికీ తమపేరు జాబితాలో రాలేదని పలువురు దరఖాస్తుదారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండో విడతలో అర్హులందరికీ మంజూరు చేస్తామన్నారు. జెడ్పీసీఈవో జితేందర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, హౌసింగ్ ఏఈ నజీర్ ఉన్నారు.





# వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**జైపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్న జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాల, ప్రైమరీ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు క్యాంపులో ఏం నేర్చుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మ్యాథ్స్, తెలుగు అక్షరాలను రాయడం, చదవడం నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గ్రామ కార్యదర్శి ఉదయ్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు. తాండూర్ మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఎంఈవో మల్లేశం సమ్మర్ క్యాంపులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 5 వరకు పాఠశాలల్లో సమ్మర్‌క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.



ఈ క్యాంపులో పిల్లల అభ్యాసన అభివృద్ధి, గణితంలో మౌలిక సామర్థ్యాలు మొదలగు వాటిలో మెలకువలు, చిత్రలేఖనం నేర్పిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు క్యాంపులు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా క్యాంపులకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో చిన్నయ్య, తాళ్లపేట పాఠశాలోని సమ్మర్ క్యాంప్‌ను హెచ్ఎం జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు.

## అప్పుల బాధతో రైతు హత్మహత్య

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**
అప్పుల బాధతో రైతు హత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తానూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఝరి (బి) గ్రామానికి చెందిన బొడ్డొళ్ల పోతన్న అనే రైతుకు మొక్కజొన్న దిగుబడి రాక అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధభరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





# ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా చేయాలి

■ ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి ■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**చెన్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

వేసవిలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరాయంగా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవిలో ప్రజలకు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, ప్రజలకు మరింత చేరువలో తాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

**కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్...**

మండలంలోని అంగరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లను అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతులకు రశీదు జారీ చేయాలని, రైతు వివరాలు, ధాన్యం వివరాలను ట్యాబ్లలో నమోదు చేయాలని తెలిపారు. పొక్కూర్ గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రహరీగోడ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని, అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని, జాబితాలో అర్హులు మాత్రమే ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యల వివరాలు తెలుసుకొని, పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సుందరశాల గ్రామపంచాయతీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీగోడ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.మోహన్, మండల పంచాయతీ అధికారి ఎండి. అజ్మత్అలీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## నిలిచిపోయిన జొన్నల తూకం

■ అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు
■ జొన్న తూకంకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్..

**బోథ్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కూడా జొన్నల తూకం నిలిచిపోవడంతో రైతులు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ సెక్రటరీ విటల్‌కు జొన్నల తూకం జరపా లని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే హమాలీలు డబ్బులు ఎక్కువ తీసుకుంటున్నారని సోమవారం పొచ్చెర గ్రామానికి చెందిన రైతు రమణ మార్కెట్ అధి కారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కూడా జొన్నల తూకం నిలిచి పోవడం జరిగింది. అకాల వర్షాలు పడితే మార్కెట్ యార్డ్ కు తీసుకువచ్చిన జొన్నలు నానిపోతే మళ్ళీ మాకే ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు హమాలీలతో చర్చలు జరిపి తూకం జరిగేటట్లు చూడాలని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి తూకం జరిగే విధంగా చూస్తామని, రైతులు అధైర్య పడవద్దని అన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ

## పనులు వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లాలో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, లబ్ధిదారుల జాబితాలపై హౌసింగ్ పీడీ, ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పైలట్ గ్రామాలలో ఎంపిక చేసిన లబ్ధిదారులు తమ ఇండ్ల పనులను ప్రారంభించే విధంగా ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలని, బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసి మొదటి విడత నిధులు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పనులలో వేగం పెంచాలన్నారు. జాబితాలో అర్హుల పేర్లు మాత్రమే ఉండాలని, అనర్హుల వివరాలు ఉన్నట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై సమగ్ర పరిశీలన జరిపి తగినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. హౌసింగ్ పి.డి.వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.



### పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి

## వెడ్మ ఫౌండేషన్ రూ.10వేల ఆర్థిక సహాయం

**ఉట్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని సేవాదాస్‌నగర్ కాలనీకి చెందిన ముస్లే మాణిక్ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. విషయం తెలుసు కున్న వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తనవంతుగా 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరెంగ అక్షయ్ తదితరులు ఉన్నారు.





### నేటి నుంచి పెంచికల్‌పేట్‌లో

## రెవెన్యూ సదస్సులు

### కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం అమలులో భాగంగా పెంచికల్‌పేట్ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించడం జరిగిందని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు దర్గోపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జనకాపూర్ గ్రామానికి దర్గోపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, చెడ్వాయి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక, అగర్ గూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, 8, 9, 12 తేదీలలో పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతేపల్లి, గుంట్లపేట్ గ్రామాలకు సంబంధించి పోతేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, లోడ్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, మురళిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మురళిగూడ, జిల్లెడ, తెల్లపల్లి గ్రామాలకు సంబంధించి మురళిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, 13, 14, 15 తేదీలలో బొంబాయిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో, ఎల్కపల్లి గ్రామపంచాయతీలోని ఎల్కపల్లి గ్రామానికి సంబంధించి పెంచికల్‌పేట్ రైతు వేదికలో కమ్మర్‌గాం గ్రామపంచాయతీ పరిధిలోని నందిగాం, కమ్మర్‌గాం, గుండెపల్లి గ్రామాలకు సంబంధించి కమ్మర్‌గాం రైతువేదికలో, 16, 17, 19 తేదీలలో ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కొండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, పంచికల్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని పెంచికల్ పేట, కోయచిచాల, గన్నారం గ్రామాలకు పెంచికల్‌పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయా తేదీలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు నిర్ణీత తేదీల్లో సకాలంలో భూ సమస్యలకు సంబంధించి దర ఖాస్తులు చేసుకోవాలని, భూభారతి చట్టం ప్రకారం పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని, అలాగే 21వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళున్నట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారి 14 నెలలవుతున్నా మున్సిపల్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు పెంచడంతోపాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 21 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోట సమ్మయ్య, కార్యదర్శి మాట్ల రాజయ్య, నాయకులు దుర్గాప్రసాద్, వినోద్ ఉన్నారు. అదే విధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు మంగళవారం జిల్లా కేంద్రంలో డీటీడీవో రమాదేవికి వినతిపత్రం అందించారు. డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమాచారి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్‌తో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆయన అన్నారు. కార్మిక కోడ్‌లను వెంటే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంబాయి, పత్రుబాయి, పుష్పలత రాము, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.





### ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన

## బంజారా నాయకులు

**నార్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

బంజారా సంఘం నాయకులు మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బంజారా తండాల్లో ఆలయాలను సొంత ఖర్చులతో అభివృద్ధి చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బంజార సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. పదవిలో ఉన్నా లేకపోయినా సమాజ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, మాజీ ఎంపీపీ సజన్‌లాల్ తదితరులున్నారు.

## పేదింటి ఆడబిడ్డ వివాహానికి సహాయం



**నార్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మండల కేంద్రానికి చెందిన పేదింటి ఆడబిడ్డ తిరువన బాయి కుమార్తె వివాహానికి సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్ మంగళవారం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన వస్త్రాలను అందజేశారు. అయన వెంట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దాదే అలీ, పెసా చైర్మన్ సికిందర్ రాథోడ్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ సుల్తాన్ ఖాన్, మాజీ వార్డ్ మెంబర్ శాంతరావ్ కర్మన్కార్, కుటుంబ సభ్యులున్నారు.

### ఉద్యోగులకు ఇచ్చిన

## హామీలను అమలు చేయాలి

**టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి**

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసి. ప్రభుత్వం పట్ల ఉద్యోగుల్లో విశ్వాసం నిలుపుకొవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉశన్నతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు ఉద్యోగులకు రావాల్సిన డిఏలు జిపిఎఫ్. రిటైరైన ఉద్యోగులు వారికి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ క్లియర్ చేస్తామని హామీ ఇచ్చి మార్చారన్నారు. సీఎం జేఏసీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

## రైలు ఢీకొని పశువులు మృతి

**రెబ్బెన, మే 6 (ప్రభాత సమాచారం)**

గోలేటి సమీపంలో రైల్వే ట్రాక్‌పై దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టి నాలుగు పశువులు మృతి చెందినట్లు బెల్లంపల్లి ఆర్పీఎఫ్ ఏఎస్సై మోహన్ రాథోడ్ తెలిపారు. మంగళవారం మృతి చెందిన పశువులను పరిశీలించారు. ఈనెల 4వ తేదీన ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్, రేచీని రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో నాలుగు పశువులు రైలుపట్టాలు దాటు తుండగా దురంతో ఎక్స్ప్రెస్ ఢీకొనడంతో మృతి చెందాయని తెలిపారు.

# తాగునీటి సమస్యను తక్షణమే స్పందించాలి



**కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

తాగునీటి సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలక్టరేట్‌లో మిషన్ భగీరథ ఇంజనీర్లు, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై దిన పత్రికలలో, ప్రసార సాధనాలలో వచ్చిన కథనాలపై అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో బుధవారం రోజున మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయితీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో తాగునీటిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని 147 హాబి టేషన్ లలోని త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలన్నారు. మిషన్ భగీరథ మోటార్లు, పైపు లైన్ల లీకేజీ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, గ్రామాలు, మున్సిపాలిటీలలో నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తాగునీటిపై ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శి తన పరిధిలో ప్రతి రోజు గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న వివరాలు ప్రతిరోజు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మిషన్ భగీరథ ఈ. ఈ. సిద్ధిఖీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులను

## సద్వినియోగం చేసుకోవాలి



**పెంచికల్‌పేట్, మే 6 (ప్రభాత సమాచారం)**

భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. మండలంలోని చేడ్వాయి రైతువేదికలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును మంగళవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పెంచికల్ పేట్ మండలం చేడ్వాయిను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు భూభారతి చట్టంపై పూర్తి అవగాహన కల్పించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, కవిత, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు

## వేగవంతం చేయాలి

**దహెగాం, మే 6 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు లగ్గాం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పంట విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.






### చైన్ స్నాచింగ్‌కు

## పాల్పడిన ఇద్దరు అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అవినాష్ కుమార్
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

బైక్‌పై వెళ్తున్న దంపతులను అడ్డగించి, బాధితుల మెడలోని బంగారు చైన్‌ను, బాధిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు నిర్మల్ జిల్లా ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల ఏప్రిల్ 30న రాత్రి ఇద్దరు దంపతులు బైక్‌పై నిర్మల్ నుంచి వెంగ్వాపేటకు వెళ్తున్న క్రమంలో కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారిని అడ్డగించి, బాధితుడి మెడలోని బంగారు చైన్‌ను, బాధిత మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించి అక్కడి నుంచి బైక్‌పై పరారయ్యారని తెలిపారు. దీంతో బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న నిర్మల్ రూరల్ పోలీసులు చైన్ స్నాచింగ్ దొంగల కోసం విస్తృతంగా గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంజులాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులు అక్కడి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు పట్టుకొని విచారించగా వారు నాందేడ్ జిల్లా సోనారి తాలూకా, పొన్నాలకు చెందిన పర్బాజీ బాలాజీ రేల్వాడ్(29), తల్వేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్(39) అని తెలిసింది. అనంతరం వారిని విచారించగా బైక్‌పై వెళుతున్న వారి వద్ద నుంచి బంగారు గొలుసును చోరీ చేసింది తామేనని నిందితులిద్దరూ అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, ఒక తులం బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ సంతోష్, సత్యనారాయణలను నిర్మల్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్మల్ పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, నిర్మల్ రూరల్ ఎస్సై లింబద్రి, సిబ్బందిలు పాల్గొన్నారు.

# పాకిస్తానీయులను దేశం నుంచి పంపించాలి



**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను పంపించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు మంగళవారం వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం మాట్లాడుతూ ఇటీవల పాకిస్తాన్ మద్దతుతో ఉగ్రవాదులు కశ్మీర్లో క్రూరమైన దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు బలికొన్నారని తెలిపారు. భారతదేశానికి వచ్చిన పాకిస్తాన్ దేశస్తులను కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో తిరిగి పంపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్, వెంకన్న తదితరులు ఉన్నారు.

**ప్రజల సమస్యలు పరిష్కరించాలి...**

ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ దోత్రేకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం మాట్లాడుతూ కెరమెరి, చింతలమానెపల్లి మండలాల్లో సరైన రోడ్లు, తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటి, విజయ్, తుకారాం, నరేశ్ పాల్గొన్నారు.

# ఈ ఆరోగ్య సమస్యలు ఉంటే పుచ్చకాయ తినొద్దు

హెల్త్ డెస్క్
ప్రభాత సమాచారం



వేసవి వచ్చిందంటే చాలు పుచ్చకాయ గుర్తుకువస్తుంది. ఎర్రగా, తియ్యగా ఉండే ఈ పుచ్చకాయను తినడం అందరికి చాలా ఇష్టం. వేసవి తాపాన్ని తగ్గించడంలో పుచ్చకాయకు మించిన పండు మరొకటి లేదు. అందుకే చాలామంది వేసవిలో పుచ్చకాయను ఇష్టంగా తింటారు. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొంతమంది పుచ్చకాయను తినకూడదు. ఎందుకంటే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి పుచ్చకాయ మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది.

### కిడ్నీ సమస్యలు ఉన్నవారు :

కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం ఉత్తమం. ముఖ్యంగా డయాలసిస్ చేయించుకుంటున్నవారు లేదా కిడ్నీలు సరిగా పనిచేయని వారు పుచ్చకాయ తినకూడదు. ఎందుకంటే పుచ్చకాయలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో కిడ్నీలు పొటాషియంను సమతుల్యం చేస్తాయి. కానీ కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో అధిక పొటాషియం రక్తంలో పేరుకుపోతుంది. దీనివల్ల హైపర్‌కలేమియా అనే పరిస్థితి వస్తుంది. ఇది గుండె లయను దెబ్బతీస్తుంది , ప్రాణాంతకం కూడా కావచ్చు. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయ తినే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

### మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు :

పుచ్చకాయలో సహజ చక్కెరలు ఉంటాయి. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి లేదా పూర్తిగా మానుకోవాలి. పుచ్చకాయ గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. మధుమేహం నియంత్రణలో లేనివారు పుచ్చకాయ తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి సమస్యలు వస్తాయి. ఒకవేళ తినాలనుకుంటే, చిన్న ముక్క మాత్రమే తినాలి. ఇతర ఆహారాలతో కలిపి తినడం వల్ల చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. మీ ఆహార ప్రణాళికలో పుచ్చకాయను చేర్చుకునే ముందు మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం ఉత్తమం.

### జీర్ణ సమస్యలు ఉన్నవారు :

కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ప్రకోప ప్రేగు సిండ్రోమ్ సెన్సిటివిటీ ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండాలి. పుచ్చకాయలో ఫ్రక్టోజ్ అనే చక్కెర ఉంటుంది. ఇది కొంతమందికి జీర్ణం కావడం కష్టం. అలాగే పుచ్చకాయలో ఉండే కొన్ని సమ్మేళనాలు కూడా జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. మీకు తరచుగా జీర్ణ సమస్యలు ఉంటే, పుచ్చకాయను తినడం మానేసి చూడండి, మీ సమస్యలు తగ్గుముఖం పడితే, పుచ్చకాయ మీకు పడటం లేదని అర్థం చేసుకోవచ్చు.



### అలెర్జీలు ఉన్నవారు :

పుచ్చకాయ అలెర్జీలు చాలా అరుదు. కానీ కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత అలెర్జీ లక్షణాలు కనిపించవచ్చు. చర్మంపై దద్దుర్లు, దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీకు ఇతర పండ్లకు అలెర్జీలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు జాగ్రత్తగా ఉండటం మంచిది.

### గుండె సమస్యలు ఉన్నవారు :

గుండె సమస్యలు ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల రక్త పరిమాణం పెరుగుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. ముఖ్యంగా గుండె బలహీనంగా ఉన్నవారు లేదా గుండె వైఫల్యం ఉన్నవారు పుచ్చకాయను ఎక్కువగా తినకూడదు. మీ గుండె సమస్య తీవ్రతను బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది మీ వైద్యుడు నిర్ణయిస్తారు.
ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం లేదా మితంగా తినడం మంచిది. అయితే, ప్రతి ఒక్కరి శరీరం ఒక్కోలా ఉంటుంది. ఒకరికి సమస్య కలిగించిన ఆహారం మరొకరికి సమస్య కలిగించకపోవచ్చు. కాబట్టి, మీకు నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు మీ వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం. వారు మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది సరైన సలహా ఇవ్వగలరు.

---

ఉగ్రవాద బాధిత దేశమైన భారతదేశానికి ఒక్కటొక్కటిగా ప్రపంచ దేశాలు మద్దతు పలుకుతున్నాయి. కొన్ని రోజుల కిందట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ కు మద్దతుగా మాట్లాడారు. తాజాగా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కూడా భారత్ కు మద్దతు పలికారు. అలాగే రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ కూడా భారత్ కు తమ సంపూర్ణ మద్దతు పలికారు. దీంతో ప్రపంచ పటంపై పాకిస్తాన్ ఏకాకిగా మారింది.



ఎస్. అబ్దుల్ ఖాలిక్

# భారత్ కు ప్రపంచ దేశాల మద్దతు

ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్ లోని పహెల్‌గామ్ లో ఉగ్రవాదులు జరిపిన దాడి యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరచింది. మొత్తం 26 మంది ఉగ్రవాదుల దుశ్చర్యకు బలయ్యారు. పహెల్‌గామ్ దాడికి నిరసనగా భారత్ లో వీధి వీధినా నిరసన ప్రదర్శనలు జరిగాయి. పాకిస్తాన్ కు తగిన గుణపాఠం చెప్పాలంటూ ప్రదర్శనకారులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం కొత్త కాదు. అనేక దేశాల్లో ఉగ్రవాద దాడులు జరిగాయి. అయితే ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా, సదరు దారులన్నీ పాకిస్తాన్ వైపే చూపిస్తుంటాయి. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ప్రేరేపిస్తోందని చెప్పడానికి ఇంతకంటే మరో ఉదాహరణ అక్కర్లేదు. వాస్తవానికి పాకిస్తాన్ రాజకీయాల్లో ఉగ్రవాదం ఒక అంతర్భాగం. పాకిస్తాన్ లో ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చే ట్రైనింగ్ సెంటర్లకు కొదవే ఉండదు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లో ఇటువంటి శిక్షణా కేంద్రాలు కోకలొల్లలు. ఒక్కమాటలో చెప్పాలంటే ఉగ్రవాద కార్యకలాపాలకు చిరునామాగా మారింది పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్. ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద దాడి జరిగినా, అక్కడి ఆపరేషన్ లో పాల్గొన్నన వారు పాకిస్తాన్ లో శిక్షణ పొందినవారే అయి ఉంటారు. కేవలం బయటి దేశాలపైనే కాదు, స్వదేశంలో రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి కూడా ఉగ్రవాదాన్ని ఒక ఆయుధంగా ప్రయోగిస్తుంటాయి పాకిస్తాన్ ప్రభుత్వాలు. ఉగ్రవాదం కార్యకలాపాలతో సంబంధాలున్నాయన్న కారణంతో రాజకీయ ప్రత్యర్థులను ఇస్లామాబాద్ పాలకులు జైళ్లకు పంపిన సంఘటనలు కూడా లేకపోలేదు. అలాగే బలూచిస్తాన్ లో అల్లర్లు సృష్టించాలన్నా, ఉగ్రమూకలను రంగంలోకి దించడం ఇస్లామాబాద్ పాలకులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. కాగా పహెల్‌గాం దాడి నేపథ్యంలో భారత్‌కు



ప్రపంచదేశాల నుంచి మద్దతు లభిస్తోంది. ఒక్కొక్కరుగా వివిధ దేశాధినేతలు పాకిస్తాన్ దుశ్చర్యను ఖండిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత్ కు అండగా తాము నిలబడతామంటున్నారు. ఉగ్రవాద దాడి జరిగిన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. భారత్ కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ట్రంప్ నకు ప్రధాని నరేంద్ర మోడీ సన్నిహిత మిత్రుడన్న సంగతి తెలిసిందే. కాగా ఇటీవల అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ , భారత్ కు అండగా నిలిచారు. పహెల్ గాం ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. అమెరికా సంపూర్ణ మద్దతు భారత్ కే అంటూ ఒక స్పష్టమైన ప్రకటన చేశారు.ఇక్కడో విశేషం ఉంది. జేడీ వాన్స్ భారత పర్యటనలో ఉండగానే, పహెల్‌గాం దాడి జరగడం విశేషం. కాగా తాజాగా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కూడా భారత్ కు జై కొట్టారు. ఉగ్రవాదంపై పోరులో తాము భారత్ కు అండగా నిలుస్తామన్నారు ఆయన. అవసరమైతే వనరులు ఇచ్చి భారత్ ను ఆదుకుంటామన్నారు మైక్ జాన్సన్. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న సంగతి యావత్ ప్రపంచానికి తెలిసిందేనన్నారు మైక్ జాన్సన్.

భారత్ కు మద్దతు పలికిన రష్యా అధినేత పుతిన్
కాగా, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ కూడా భారత్ కు అండగా నిలిచారు. తాజాగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి వ్లాదిమిర్ పుతిన్ ఫోన్ చేశారు. రష్యా తరపున భారత్ కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉగ్రవాదం పై పోరాటంలో భారత్ కు తాము వెన్నంటి ఉంటామని పుతిన్ భరోసా ఇచ్చారు. ఒకవైపు భారత్ కు ప్రపంచ దేశాల నుంచి మద్దతు పెరుగుతుంటే మరోవైపు పాకిస్తాన్ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాకిస్తాన్ ముస్లిం దేశం కావడంతో తమకు మతపరంగా ఆ దేశాల మద్దతు ఉంటుందని దాయాది దేశం భావించింది. అయితే మెజారిటీ ముస్లిం దేశాలు ఏవీ, పాకిస్తాన్ కు మద్దతు పలకలేదు. కాగా చైనా మాత్రం పాకిస్తాన్ కు మద్దతు ప్రకటించింది. ఇప్పటివరకు పాకిస్తాన్ కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన ఏకైక దేశం చైనాయే. కొంతకాలంగా ఆసియా రాజకీయాలకు సంబంధించి చైనా, భారత్ మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్ కు చైనా మద్దతు పలికిందన్నది రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. మొత్తం మీద పహెల్ గాం దాడితో ప్రపంచ రాజకీయాల్లో పాకిస్తాన్ ఏకాకిగా మారింది. ఒక్కటంటే ఒక్క దేశం కూడా పాకిస్తాన్ కు అనుకూలంగా మాట్లాడలేదు. ఇదే సమయాన పాకిస్తాన్ ను అష్ట దిగ్బంధనం చేయడంలో భారత్ చాలా వరకు విజయమంతమైంది. భారత్ తీసుకున్నఅనూహ్య చర్యలతో ఇప్పటికే పాకిస్తాన్ గొంతెండుతోంది. మరోవైపు అంతర్జాతీయ వేదికల నుంచి దాయాది దేశానికి రూపాయి అప్పు పుట్టని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో తాను తీసిన గోతిలో తానే పడ్డట్టు అయింది పాకిస్తాన్ పరిస్థితి.



# సర్జికల్ స్ట్రైక్స్‌తో సరిపెడతారా?

భారత్-పాకిస్తాన్ మధ్య ప్రస్తుతం యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఏక్షణమైనా పాకిస్తాన్ పై భారత్ యుద్ధం ప్రారంభించవచ్చు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాల సైనిక పాటవం పై చర్చ జరుగుతోంది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఆయుధాలను బేరీజే వేస్తే, మనమే టాప్ పొజిషన్ లో ఉన్నాం. సైనికబలం, ఆయుధ నిల్వల పరంగా చూస్తే పాకిస్తాన్ కంటే భారత్ చాలా ముందు ఉంది. భారతదేశం ప్రపంచంలోనే నాల్గవ అతి పెద్ద సైనిక బలగాన్ని కలిగి ఉంది. కాగా సైనిక పాటవంలో పాకిస్తాన్ 12వ పొజిషన్ లో ఉంది. ఇందులో మరో ముచ్చటే లేదు. ప్రస్తుతం ఉన్న ఆయుధాల ఆధారంగా భారత్ సమరంలోకి దిగితే వారం పది రోజుల్లో ప్రపంచపటంపై నుంచి పాకిస్తాన్ అదృశ్యం అవుతుంది. ఇదేదో దారినపోయే దానయ్య మాటలు కావు.ఎంతో మంది యుద్ధరంగ నిపుణులు చెబుతున్న మాట. అయితే పహెల్ గాం దాడి జరిగి పది రోజులైంది. అయినప్పటికీ పాకిస్తాన్ పై పూర్తి స్థాయి యుద్ధాన్ని భారత్ ప్రకటించలేదు. ప్రధానంగా పాకిస్తాన్ ను అష్ట దిగ్బంధనం చేయడంపైనే భారత్ దృష్టి పెట్టింది. మొదట సింధు జలాల ఒప్పందం రద్దుతో నీటి యుద్ధాన్ని ప్రకటించింది. ఆ తరువాత పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ వ్యూహం అమలైతే, పాకిస్తాన్ ప్రపంచం ముందు బిచ్చమెత్తుకోవాల్సిన దారుణ పరిస్థితులు నెలకొంటాయి. వీటికి తోడు ఇటీవల పాకిస్తాన్ నుంచి అన్ని ఎగుమతి , దిగుమతులపై నిషేధం వేటు వేసింది భారత్ . దాయాది దేశానికి ఇదొక కోలుకోలేని దెబ్బ. అయితే భారత్, పాకిస్తాన్ రెండే అణ్వాయుధ దేశాలే. భారత్ వద్ద 172 అణ్వాయుధ వార్ హెడ్లున్నాయి. కాగా పాకిస్తాన్ దగ్గర 170 వార్ హెడ్‌లున్నాయి. ఈ అంశమే భారతదేశాన్ని కలవరపరుస్తోంది. ఏదైనా ప్రాంతాన్ని టార్గెట్ చేసుకుని అణ్వాయుధాలను ప్రయోగిస్తే, ఒక శతాబ్దం పాటు అక్కడ గడ్డి కూడా మొలవదు. అణ్వాయుధం అంత డేంజరస్. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్లకు పైగా కొనసాగుతోంది. అయినప్పటికీ అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ ఎన్నడూ అణ్వాయుధాల జోలికి వెళ్లలేదు. అణ్వాయుధాల ప్రయోగం ఎంత ప్రమాదకారో పుతిన్ అలాగే జెలెన్‌స్కీకి తెలుసు. అందుకే వాటి జోలికి వెళ్లలేదు ఉభయ దేశాలు. కాగా పాకిస్తాన్‌కు ప్రస్తుతం ఆర్మీ చీఫ్ గా మునీర్ ఉన్నారు. మునీర్ ను ఒక కర్కోటకుడిగా అక్కడి ప్రజలు భావిస్తుంటారు. ఇప్పటికే , అణ్వాయుధాలతో భారత్ ను సర్వ నాశనం చేస్తామంటూ హూంకరింపులు ఇస్తుంటాడు మునీర్. అయితే మనీర్ అన్నంత పని చేసినా, ఆశ్చర్య పోనక్కర్లేదు. ఎందుకంటే పాకిస్తాన్ ప్రభుత్వాలు నామమాత్రం. అక్కడ రాజకీయ స్థిరత్వం తక్కువ. పెత్తనం చేసేది అంతా ఆర్మీనే. అంటే ఆర్మీ చీఫ్ మునీర్ చేతిలో అణ్వాయుధాలు ఉన్నట్లే. సింపుల్ గా చెప్పాలంటే పిచ్చోడి చేతిలో రాయి కిందే లెక్క. పాకిస్తాన్ నుంచి భారత్ లోని ఢిల్లీ సహా మరికొన్ని నగరాలపై అణ్వాయుధాలు ప్రయోగించడానికి రంగం సిద్ధం చేసింది అక్కడి ప్రభుత్వం.

**ఆచితూచి అడుగులు వేస్తున్న భారతదేశం**

ఇటువంటి పరిస్థితుల్లో ఆచితూచి అడుగేయాలని భారత్ భావిస్తోంది. పాకిస్తాన్ పై పూర్తి స్థాయి యుద్ధం కాకుండా సర్జికల్ స్ట్రైక్స్ ప్రయోగించాలన్నది నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. పుల్వామా అటాక్ తరువాత భారత్ చేసింది సర్జికల్ స్ట్రైక్స్ ప్రయోగమే. సర్జికల్ స్ట్రైక్స్ అంటే ఒక ప్రాంతాన్ని టార్గెట్ చేసుకుని ఆయుధాలు ప్రయోగించడం. దీనివల్ల మనం అనుకున్న స్థాయిలో ప్రత్యర్థికి నష్టం కలిగించవచ్చు. అయితే అణ్వాయుధాల రేంజ్ లో నష్టం జరగదు. అయితే ఈసారి భారీ ఎత్తున వరుస సర్జికల్ స్ట్రైక్స్ ప్రయోగించి, పాకిస్తాన్ ను ఇరుకున పెట్టాలన్నది భారత ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.మొత్తంమీద నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం సంయమనంతో వ్యవహరిస్తోంది. చాలా తెలివిడిగా ప్రత్యర్థి దేశం అణ్వాయుధాలు ప్రయోగించకుండా కట్టడి చేస్తోంది. తన దేశ పౌరులకు ఎటువంటి దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రత్యర్థిని దెబ్బ తీయడంతో పాటు పాటు స్వంత ప్రజలను సురక్షించుకోవడం అనే రెండంచెల వ్యూహంతో ముందుకు పోతోంది భారత ప్రభుత్వం.

# ప్రతీ కార్యకర్త శ్రమించాలి

**■ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి ■ అర్హులైన వారికి తప్పకుండా పదవులొస్తాయ్..**
**■ యువత, మహిళలను రాజకీయంగా ముందుకుతీసుకొస్తాం ■ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి..**
**■ బెల్లంపల్లిలో కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి**



**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పెద్దలు, ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని టీపీసీసీ రాష్ట్ర పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. సోమగూడెంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆయిల్ ఫామ్ కార్పొరేషన్ చైర్మన్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జంగా రాఘవరెడ్డి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటికో వారసున్ని కాంగ్రెస్‌లోకి సైనికులా పంపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ జెండా మోసి పార్టీకి సేవ చేసిన వారికి మాత్రమే పదవులు దక్కుతాయని తేల్చి చెప్పారు. జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఏఐసీసీ పెద్దలు సోనియా గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ రాహుల్ గాంధీ ఎఐసిసి అగ్రనేతలు ఈ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి రాష్ట్రంలో అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో మన రాష్ట్రంలోని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో నిర్వహిస్తున్నామన్నారు. దేశాన్ని ప్రస్తుతం పాలిస్తున్న జాతీయ పార్టీలు భారత రాజ్యాంగాన్ని మార్చే దిశగా అడుగులకి అడ్డుపడాలన్నారు. ఈ ఉద్దేశంతోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి గడపగడపకు తెలియజేయడం ప్రధాన ఉద్దేశం అన్నారు. రాజ్యాంగం ద్వారా మనం పొందుతున్న హక్కులను సమాజంలో ప్రతి గడపగడపకు తెలియజేయాలన్నారు. గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన త్యాగాలతో ఇంత స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి మనకు స్వాతంత్రం తీసుకొచ్చిందని వివరించారు. స్వేచ్ఛగా ప్రజలు బ్రతకడానికి గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్రను మర్చిపోవద్దన్నారు. ఆనాడు స్వాతంత్రం తీసుకొచ్చింది, నాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఎన్నడూ మర్చిపోవద్దన్నారు. ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతీ నాయకుడు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి శక్త వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ గ్రంథాలయ చైర్మన్ మల్లేష్, ఏఎంసి చైర్మన్ స్వామి, టీపీసీసీ మెంబర్ శంకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రజిత, టిపిసిపి సెక్రెటరీ నూకల రమేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో మానసిక ఉల్లాసం

**మందమర్రి, మే 6 (ప్రభాత సమాచారం)**

క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, క్రమ శిక్షణ కలుగుతుందని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాలమైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణపూర్, సోమగూడెంలకు చెందిన పిల్లలకు వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం పిల్లలకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పీఎం శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్, సమన్వయకర్త శివకృష్ణ, గ్రౌండ్ ఇన్‌చార్జీ తిరుపతి పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన కానిస్టేబుల్

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

బాసర గోదావరి నదిలో దూకబోయిన మహిళ ప్రాణాలను మంగళవారం కానిస్టేబుల్ మోహన్ సింగ్ కాపాడారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కోస్లికి చెందిన రాథోడ్ లతకు తన అత్తతో గొడవ కావడంతో ఈ చర్యకు పాల్పడినట్లు కానిస్టేబుల్ తెలిపారు. అనంతరం ఆమెను పోలీస్ స్టేషన్ తరలించి, కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓ మహిళా ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను అభినందించారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ పై రైతులకు అవగాహన

**బోథ్, మే 6 (ప్రభాత సమాచారం)**

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీకి దరఖాస్తు చేసుకోవాలని కప్పర్ల వ్యవసాయ విస్తరణ శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం తాంసి మండలంలోని పాలోడి గ్రామంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. రైతులు ఆధార్ నెంబర్ తో దరఖాస్తు చేసుకోవాలని ఆధార్ నెంబర్‌కు అనుసంధానం ఉన్న ఫోన్ నెంబర్ వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు చేరాలని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి క్యాంప్ ఆఫీసులో డిగ్రీ అడ్మిషన్ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ తో కలిసి ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీలో చేరాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పిలుపునిచ్చారు. అన్ని హంగులతో కొనసాగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో నూతన కోర్సులు ప్రారంభమ య్యాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. అర్హత, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తున్నారన్నారు. దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను అందజేస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బిజెడ్‌సి కోర్సులతో పాటు ఈ ఏడాది కొత్తగా బీకాం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ ఇన్సూరెన్స్, బీకాం టాక్సేషన్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తమ కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులు డిగ్రీ పూర్తి కాగానే ఉపాధి మార్గాలను చేరువ చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బొంకురి ప్రవీణ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు గజెల్లి మోహన్, డాక్టర్ కొండగొర్ల చంద్రశేఖర్, డాక్టర్ కంబాల మురళీకృష్ణ, అధ్యాపకురాలు కూనురాజుల సమ్మక్క పాల్గొన్నారు.





## ప్రాణం తీసిన తేనెటీగలు

**■ గోలేటి-1 ఇంక్లైన్ వద్ద తేనెటీగ దాడి..**
**■ తేనెటీగల దాడిలో తాపీమేస్త్రీ మృతి**
**■ మరో ముగ్గురు కార్మికులకు గాయాలు**
**■ మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్**
**■ నష్టపరిహారం ఇచ్చేందుకు ఒప్పుకున్న కాంట్రాక్టర్**

**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. గోలేటి-1 ఇంక్లైన్ ప్రహరీ మరమ్మతు పనులను కాంట్రాక్టర్ పైడిధర్‌కు అప్పగించారు. మంగళవారం ఉదయం మాదారానికి చెందిన తాపిమేస్త్రీ నర్సయ్య, మైలారపు శ్రీనివాస్, హిమండి దుర్గారావు ఈ పనులకు వెళ్లారు. ఈక్రమంలో పక్కనున్న చెట్టుపై ఉన్న తేనెటీగలు వీరిపై దాడి చేశాయి. ప్రాణభయంతో పరుగులు తీసినా నర్సయ్యకు తీవ్రగాయాలు, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నర్సయ్యను గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నర్సయ్యకు ముగ్గురు కూతుళ్లుండగా అందరికీ వివాహాలయ్యాయి. పెద్దకూతురు సంధ్య అన్నీ తానై తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. ఏఐటీయూసీ నాయకులు ఎస్. తిరుపతి, మారం శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, అలవేణి సంపత్ ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం ఇచ్చేలా సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పించినట్లు వారు తెలిపారు.

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా జడ్జి శ్రీవాణి సూచించారు. జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కేసుల సత్వర పరిష్కారంపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసు ఉన్నతాధికారులతో మంగళవా రం సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. జిల్లాలో నేరాల అదుపునకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పరిష్కారం కాని సందర్భంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చూడాలని తెలిపారు. చట్టాల ఆవశ్యకతను వివరించాలన్నారు. జాతీయ న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. సమావేశంలో జడ్జీలు, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్ కుమార్, కృష్ణ, జిల్లాలోని ఎస్సైలు, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.







# పసితనానికి.. పలుపు తాడు..!

ఆడపిల్ల తన జీవితంలో ఎన్నో కలలు కంటోంది..
ఆ కలల్ని కల్లలు చేస్తూ..
కల్యాణ తిలకం దిద్దుతున్నారు..
భవిష్యత్తును బుగ్గి చేస్తూ..
నదుట బాసికం కట్టేస్తున్నారు..
పసి ప్రాయంలోనే...
కళ్లకు పారాణి పెట్టేస్తున్నారు..
పెళ్లి అనే పేరుతో.. బాల్యంలోనే బలిపీఠం ఎక్కిస్తున్నారు.

■ బాల్యానికి మూడు 'ముళ్లే' ■ బడికెళ్లాల్సిన వయసులో పెళ్లిపీటలెక్కుతున్న బాలికలు ■ ఉమ్మడి జిల్లాలో పెరిగిపోతున్న బాల్య వివాహాలు

■ 10నెలల్లో 90 వివాహాలను అడ్డుకున్న అధికారులు ■ తెలియకుండా జరుగుతున్నవి వందల సంఖ్యలో ■ పేదరికం, అవగాహనా రాహిత్యంతో వివాహాలు..

■ చిన్నవయస్సులో పెళ్లితో అనేక అనర్ధాలు ■ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం రెండేళ్ల జైలు ■ బాల్య వివాహాలపై చైతన్యం తీసుకువారాలి

ఆధునికత కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చిన్నారి అమ్మలు, ఒంటరి తల్లులు, కౌమారంలోనే వృద్ధాప్యఛాయలు కనిపిస్తున్న వివాహితలు వందల మంది కనిపిస్తారు. బాల్య వివాహాలను అధికారులు అడ్డుకుంటున్నా.. గుట్టుచప్పుడు కాకుండా జరిగిన వివాహాలెన్నో... లెక్కలేదు. ఎదిరించే వయసులేదు.. తిరగబడే ధైర్యంలేదు.. కాదనే శక్తి లేదు.. ఏం చేయగలదా అమాయక బాలిక? మహా అయితే, ఎగదన్నుకొస్తున్న కన్నీళ్లను తలంబ్రాల చీరతో తుడుచుకుంటుంది. గుండెల్లోని మంటల్ని హోమాగ్నిలో చూసుకుంటుంది. ఏడడుగులు... కష్టాలు, కన్నీళ్లు, అనారోగ్యం, లింగవివక్ష, దుర్భరదారిద్ర్యం, విడాకులు, ఆత్మహత్యలే..! ముడులు మూడే... వాటిచుట్టూ పదునైన ముళ్లు మాత్రం లెక్కలేనన్ని.. అప్పగింతలంటే.. మేకపల్లలా కసాయి వెనకే తలవంచుకుని నడవడం.. చాలా మందికి అదసలు పెళ్లని తెలియదు. వాడో మెగుడని తెలియదు. మెడలో వేలాడుతున్నది మంగళసూత్రమనీ తెలియదు. అంత అమాయకత్వం కొందరైతే ఏ మూడోతరగతో.. ఇప్పటికీ జిల్లాలోని మారుమూల మండలాల్లో బాల్యవివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఓ వైపు అన్ని రంగాల్లో దూసుకెళ్తూ తమదైన ముద్ర వేస్తుంటే.. మరో వైపు వెనుకబడిన ప్రాంతాల్లో ప్రగతికి దూరంగా అక్షర ఫలాలు నోచేకోకుండా మూఢనమ్మకాల్లో మగ్గిపోతున్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన లేమి.. ఆడపిల్లలను బాధ్యతగా కాకుండా బరువుగా భావిస్తుండడంతో జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయి.. నమ్మడానికి విచిత్రంగా ఉన్నా... ఇటీవల బాల్యవివాహాలు అడ్డుకున్న సంఘటనలు చాలా జరిగాయి.

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

బాల్యవివాహాలు అరికట్టడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పక్కా సమాచారంతో అడపాదడపా అధికారులు అడ్డుకుంటున్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నా తల్లిదండ్రులు, సమాజం తీరులో మార్పు రావడం లేదు. ఆర్థిక ఇబ్బందులు, నిరాక్షరాస్యత, తొందరగా పెళ్లి చేస్తే బాధ్యతలు తగ్గుతాయనే ఆలోచనతో కుటుంబ పెద్దలు బాలికలకు చదువుకునే వయస్సులోనే పెళ్లి చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో బాలికలకు 16 ఏళ్లలోపే పెళ్లి చేసి వారి బాల్యానికి మూడు ముళ్లు వేస్తున్నారు. జిల్లాలో 2019 నుంచి నేటి వరకు జిల్లా అధికారులు 153 బాల్యవివాహాలు అడ్డుకుని కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా బాల్య వివాహాలు ఆగడం లేదు.. పెళ్లి పేరుతో 12-15 ఏళ్లకే బాలికలు పుస్తెల భారం మోయాల్సి వస్తోంది. ప్రస్తుతం పెళ్లిళ్లకు మార్చి, ఏప్రిల్ నెలల్లో ముహూర్తాలుండటంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గ్రామాలు, తండాలు, గిరిజన గూడెల్లో పెళ్లి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు ఆర్థిక పరిస్థితులు, మరోవైపు నిరక్షరాస్యత, అవగాహన లేమి, పిల్లలపై అపనమ్మకం, తదితర కారణాల వల్ల ప్రతీఏటా పదుల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి.. అధికారులకు తెలిసి ఆపినా అనంతరం రెండు, మూడు రోజుల్లో పరిస్థితి సద్దుమణిగాక, పిల్లల తల్లిదండ్రులు గుట్టుగా బాల్య వివాహాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారంతో అక్కడికి చేరుకున్న అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు. బెజ్జూర్ మండలం బారెగూడ గ్రామంలో కూడా బాల్యవివాహాన్ని అడ్డుకుని బాలల సంరక్షణ అధికారులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

**అవగాహన లోపంతో..**

బాల్యవివాహాలు ఎక్కువగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. బాలికలకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా.. కుటుంబ ఆర్థిక పరిస్థితులతోపాటు దగ్గరి సంబంధాల పేరుతో తల్లిదండ్రులు వివాహం చేయడానికి మొగ్గు చూపుతున్నారు. పదో తరగతి పూర్తయిన బాలికలకు పెళ్లి చేసి బాల్యాన్ని బందీ చేస్తున్నారు. పెళ్లిళ్లు చేసే బాలికల సగటు వయస్సు 16 సంవత్సరాలు ఉంటే వీరిని 25 ఏళ్ల యువకులు వివాహం చేసుకుంటున్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం ద్వారా మైనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పేరుకే కమిటీలు..**

బాల్యవివాహాలు నిరోధించడానికి ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. వీటిలో జిల్లా స్థాయిలో కలెక్టర్ బాల్యవివాహాల నిరోధక అధికారిగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, సీడీపీవో, మండల స్థాయిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, గ్రామస్థాయిలో అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు కమిటీలో ఉన్నారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగిన సమయంలో మాత్రమే అధికారుల దృష్టికి వస్తున్నాయి. వీటిని మాత్రమే అడ్డుకుంటున్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కఠిన చట్టాలు ఉన్నా..**

బాల్య వివాహాలు అడ్డుకోవటానికి ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 2006 చట్టం ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే వరుడితోపాటు తల్లిదండ్రులు, పెళ్లికి హాజరైన బంధువులు, వివాహం చేసిన పురోహితులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించేందుకు ఆస్కారం ఉంటుంది. మైనర్ బాలికను వివాహం చేసుకుని జీవనం సాగిస్తే వరుడు, అతడి తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు, బంధువులపై పోక్సో చట్టం ప్రకారం పదేళ్ల నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష విధించవచ్చు.

## బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు...

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

తానూర్ మండలంలోని బోసి గ్రామంలో బాల్యవివాహం జరగబోతున్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ శాఖ అధికారులు సకాలంలో స్పందించి వివాహాన్ని అడ్డుకున్నారు. బోసి గ్రామానికి చెందిన 14ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై, సీడిపిఒ సరోజినీ, ఏసీడిపిఒ నాగలక్ష్మి, బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలుఅక్కడికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సె లింగ్ నిర్వహించి, బాల్యవివాహం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. ఇరుకు టుంబాల నుంచి కూతురు మేజర్ అయ్యే వరకు వివాహం జరిపించబోమని హామీ పత్రాలు రాసుకున్నారు.



**ముందుగానే అవగాహన కల్పిస్తే...**

మంచి, చెడు తెలియక కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసి బాధ్యత వదిలించుకోవాలని భావిస్తున్నారు. పసితనం, తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పలేని బాలికలు పెళ్లిళ్లలకు ఒప్పుకుంటున్నారు. ఈ తరుణంలో వివాహాలకు ముహూర్తాలు నిశ్చయించుకుని పెళ్లి పీటలపై కూర్చున్న సమయంలో అధికారుల జోక్యంతో పెళ్లిళ్లు ఆగిపోతున్నాయి.. అప్పటికే కట్నకానుకలు ఇచ్చేయడం, పెళ్లి భోజనాలు ఏర్పాట్లు చేసుకున్నాక పెళ్లి నిలిచిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురై మానసికంగా కుంగిపోతున్న సంఘటనలు సైతం కోకొల్లలు. అయితే అధికారులు ముందు నుంచే గ్రామాల్లో బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కల్పిస్తే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడవచ్చు.



## బాల్య వివాహానికి కారణాలు..

- కుటుంబంలో ఆర్థిక సమస్యలు, కొన్ని చోట్ల సెంటిమెంట్
- ఇంట్లో పెద్దలు వయస్సు మీరిపోయి చివరిదశలో ఉన్నప్పుడు వారు తమ పిల్లల పెళ్లిళ్లు చూడాలని కోరవడంతో వారి సంతృప్తి కోసం వివాహాలు చేయడం
- మూఢనమ్మకాలు, అమ్మాయిల విషయంలో అభద్రతాభావం



## ఎవరికి ఫిర్యాదు చేయాలి..?

బాల్యవివాహాలపై వీఆర్వో, అంగన్వాడీ సూపర్వైజర్, తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీవో, ఆర్డీవో, కలెక్టర్, ఎస్పీ, పోలీసులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వవచ్చు. అలాగే 1098, 100 నెంబర్లకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేయవచ్చు. ఎవరైనా సరే... బాల్యవివాహాలపై సమాచారం ఇచ్చిన ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతారు.



## బాల్యవివాహ చట్టం ఏం చెబుతోంది..



బాల్యవివాహ నిరోధక చట్టం 1929లో వచ్చింది.. కానీ చట్టం అమలులో లోపాలను సవరిస్తూ 2006లో మరింత పటిష్టం చేస్తూ అదనంగా రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానాతో పాటు బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తితో పాటు వధూవరుల తల్లిదండ్రులు, వివాహం చేసిన పెద్దలు, మత పెద్దలు, బంధువులు, ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్, పెళ్లి జరిపించిన పంతులు, హాజరైన అందరిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. వీఆర్వో, అంగన్వాడీ సూపర్వైజర్, తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీవో, ఆర్డీవో, కలెక్టర్, పోలీసులు, బాల్య వివాహాల నిరోధక అధికారులుగా ఉంటారు.

## సమాజంలో మార్పులు వచ్చినా..



కాలం మారుతోంది.. సమాజం మారుతోంది. ఆలోచనలు మాత్రం మారడం లేదు.. ఆడపిల్ల అంటే గుండెల మీద కుంపటి..! ఎప్పుడు వదిలించుకుందామా అన్న తొందర, అందుకేనేమో, పదమూడేళ్ల వయసులోనే సుమంగళికి పెళ్లి చేశారు. ఎదిగీ ఎదగని శరీరం. వికసించీ వికసించని ఆలోచనలు.. పెళ్లంటే, మనువాడిన మనిషితో కలిసిమెలసి ఉండటమే, కష్టసుఖాలు పంచుకోవడమే అన్న సంగతి కూడా తెలియక ముందే... కాపురాలు బీటలు వారుతున్నాయి.. అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇచ్చినప్పుడు మాత్రమే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.



# రకుల్ రెడ్ లవ్..

నటి రకుల్ సోషల్ మీడియాలో మరో లేటెస్ట్ ఫొటో షూట్ షేర్ చేసింది. రెడ్ లెహంగాలో రకుల్ స్టన్నింగ్ లుక్స్ నెట్టింట అందరి దృషిని ఆకర్షిస్తున్నాయి. ఈ ఫొటోలు మీరు కూడా చూసేయండి. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన రకుల్.. మళ్ళీ వరుస ప్రాజెక్ట్స్ తో బిజీ అయిపోయింది. ప్రస్తుతం రకుల్ ఇండియన్ 3 తో పాటు హిందీలో రెండు ప్రాజెక్టులు సైన్ చేసింది. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ యాక్టీవ్ గా కనిపించే రకుల్.. తాజాగా మరో గ్లామరస్ ఫొటో షూట్ షేర్ చేసింది. రెడ్ లెహంగాలో రకుల్ స్టన్నింగ్ లుక్స్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు ఫైర్, హార్ట్ ఈమోజీస్ తో కామెంట్లు పెడుతున్నారు. రకుల్ తెలుగులో సరైనోడు, రంగ రంగ వైభవంగా, ధృవ, నాన్నకు ప్రేమతో, లౌక్యం సినిమాలతో ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. డిజైనర్ లెహంగా మెడలో డైమండ్ చోకర్ తో స్టైలిష్ గా ముస్తాబైంది. రకుల్ తెలుగులో చివరిగా 2021లో కొండపొలం సినిమాలో మెరిసింది. ప్రస్తుతం మంచి కమ్ బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న బ్యూటీ



# మెగా ఫ్యామిలీలోకి మరో బుజ్జి బాబు..

మెగా హీరో వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి దంపతులు అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. మెగా ఫ్యామీలీలోకి మరో బుజ్జి పాపాయి రాబోతున్నట్లు ప్రకటించారు. "జీవితంలో ఇప్పటివరకు అత్యంత అందమైన పాత్ర .. త్వరలో రాబోతుంది" అంటూ తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. దీంతో మెగా అభిమానులు, సెలెబ్రెటీలు వరుణ్ దంపతులకు శుభాకంక్షాలు తెలియజేస్తూ కామెంట్లు పెడుతున్నారు. సమంత, రకుల్, బెల్లంకొండ శ్రీనివాస్, అల్లు స్నేహారెడ్డి, సుశాంత్, రీతూ వర్మ తదితరులు తమ విషెష్ తెలిపారు. అంతరిక్ష్యం, మిస్టర్ సినిమాల్లో కలిసి నటించిన వరుణ్- లావణ్య ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు రిలేషన్ షిప్ లో ఉన్న ఈ జంట.. 2023 నవంబర్ 1న ఇరు కుటుంబ సభ్యుల అంగీకారంతో ఘనంగా వివాహం చేసుకున్నారు. పెళ్ళైన ఏడాదిన్నర తర్వాత.. ఇప్పుడు తమ ఫస్ట్ బేబీని వెల్కమ్ చేస్తున్నారు ఈ జంట. క్లింకార తర్వాత మెగా ఫ్యామిలీలోకి మరో బుజ్జి బాబు/ పాప రానుండడంతో కుటుంబం అంతా సంతోషంలో ఉన్నారు. ఇదిలా ఉంటే పెళ్లి తర్వాత కూడా లావణ్య తన సినీ కెరీర్ ను అలాగే కంటిన్యూ చేస్తున్నారు. పెళ్లి తర్వాత లావణ్య మొదటి సారిగా 'మిస్టర్ పర్ఫెక్ట్' అనే వెబ్ సీరీస్ లో మెరిసింది. ఆ తర్వాత ఇటీవలే సతీలీలావతి అనే ప్రాజెక్ట్ సైన్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఇప్పుడు లావణ్య ప్రెగ్నెంట్ కావడంతో సినిమా షూట్ కంటిన్యూ అవుతుందా..? లేదా బ్రేక్ పడుతుందా? చూడాలి.



# 'హిట్ 3' దిమ్మతిరిగే కలెక్షన్స్..

నేచురల్ స్టార్ నాని శైలేష్ కొలను కాంబోలో విడుదలైన హిట్3 బాక్స్ ఆఫీస్ వద్ద కలెక్షన్ల జోరు కొనసాగిస్తోంది. తొలిరోజే రూ. 40 కోట్ల వసూళ్ల తో అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే 100 కోట్ల క్లబ్ లోకి చేరింది. నాలుగు రోజుల్లో 'హిట్ 3' ప్రపంచవ్యాప్తంగా రూ. 101 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. "సర్కార్స్ సెంచరీ" అంటూ ట్వీట్ చేశారు. సక్సెస్ ఫుల్ థియేట్రికల్ రన్ కొనసాగుతుండడంతో కలెక్షన్స్ ఇంకా పెరిగే అవకాశం ఉంది. హాయ్ నాన్న, కోర్ట్, హిట్3 వరుస విజయాలతో ఫుల్ జోష్ ఉన్నారు నాని. నాని స్వయంగా ప్రొడ్యూస్ చేసిన ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, కోమలీ ప్రసాద్, సముద్రఖని, రావు రమేష్, రవీంద్ర విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.ఇదిలా ఉంటే ఈ సినిమా తర్వాత 'పారడైస్' అంటూ మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ తో ముందుకు వస్తున్నారు నాని. ఇందులో ఇప్పటివరకు ట్రై చేయని ఓ భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి టైటిల్ గ్లింప్స్ విడుదల చేయగా.. నాని మాస్ లుక్, డైలాగ్స్ ఫ్యాన్స్ కి ఫుల్ జోష్ ఇచ్చాయి. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



# విలన్ పాత్రలో సుహాస్

తెలుగులో వరుస సినిమాలతో సక్సెస్ ఫుల్ గా రాణిస్తున్న యంగ్ హీరో సుహాస్.. ఇప్పుడు తమిళ్ ఇండస్ట్రీలో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందుతున్న లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'మండాడి' సినిమాతో ఎంట్రీ ఇవ్వబోతున్నారు. అయితే ఈ సినిమాలో సుహాస్ పాత్ర గురించి కొద్ది రోజులుగా రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమా తమిళ్ వెర్షన్ లో సూరీ హీరోగా కనిపించగా.. తెలుగు వెర్షన్ లో సుహాస్ హీరోగా కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు సుహాస్. 'మండాడి' తెలుగు, తమిళ్ వెర్షన్స్ లో తాను విలన్ పాత్ర మాత్రమే పోషిస్తున్నానని.. యాక్టర్ సూరీ హీరోగా నటిస్తున్నారని తెలిపారు. అలాగే ఈ సినిమా నుంచి తన ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఫుల్ గడ్డంతో రా అండ్ రస్టిక్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు. వెట్రిమారన్ దర్శకత్వంలో సుహాస్ తమిళ్ ఎంట్రీ.. అతడికి మంచి ఆరంభం కానుందని అనుకుంటున్నారు ఫ్యాన్స్. ఈ సినిమాలో మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక



**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందించా లని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. పెన్ గంగలో ఇసుక లభ్యతపై ఇటీవల సంయుక్త పరిశీలన చే పట్టిన మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్వటర్, రెవెన్యూ శాఖల అధికారులు జైనథ్, భీంపూర్, తాంసి, బేల మండలాల్లోని నది పరీవాహక ప్రాంతాల్లోని పది ఇసుక రీచ్లను గుర్తించారు. వాల్టా చట్టం అనుసరించి ఇసుక వెలికితీయాలని నిర్ణయించారు. తహసీల్దార్ల పర్యవేక్షణలో సరఫరా ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ఉచితంగా ఇసుక అందించేందు కోసం పెన్గంగలో మొత్తం పది ఇసుక రీచ్లను ఎంపిక చేశారు. భీంపూర్ మండలం అంతర్గాంలో ఇసుక మందం 1.5 మీటర్లుగా గుర్తించిన అధికారులు గుబిడి, వడూర్, తాంసి-కే గ్రామాల్లో, అలాగే జైనథ్ మండలంలోని సాంగ్వి-కే, ఆనందూర్, భోరజ్ మండలంలో డోల్లరా, పెండల్వాడలో 0.5 మీటర్లుగా, బేలమండలంలో మణియర్పూర్, సాంగిడి గ్రామాల్లో 1.5 మీటర్లుగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లోను ఇసుకను ఉచితంగా సరఫరా చేయనున్నారు. ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఉచిత ఇసుక సరఫరా చేపట్టనున్నారు. ఇసుక అవసరమున్న ఇందిరమ్మ లబ్ధిదారులు, ప్రభుత్వ భవనాల ని ర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు ముందుగా సంబంధిత తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాలి. వారికి ప్రాధాన్యత క్రమంలో తహసీల్దార్లు వే బిల్లులు జారీ చేస్తారు. వాటి ఆధారంగా నిర్దేశించిన సమయాల్లో ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే ఆయా వాహనాల డ్రైవర్లకు లైసెన్స్తో పాటు వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఇసుకను ఎక్కడికి తీసుకెళ్తున్నారనేది తహసీల్దార్లకు తప్పనిసరిగా సమాచారమందించాలి. తీసుకువెళ్లిన ఇసుకను ఎక్కడ డంప్ చేశారనేది సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంప్ చేసినా, నిర్దేశిత పనులకు కాకుండా ఇతర వాటికి తరలించినా చట్టప్రకారం ఆ డంప్ను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. ఇసుక అవసరమున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



## అప్రమత్తంగా ఉండాలి

**ఇంద్రవెల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రతీ రోజు రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పని తీరు, తదితర రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్ను పరిశీలించి అవసరమైన ముఖ్య ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండాకాలంలో వేడి ద్వారా వచ్చే అనారోగ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు శ్రీకాంత్, పూజిత, సిబ్బంది పాల్గొన్నారు.

## భైంసాలో అగ్ని ప్రమాదం

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని నిర్మల్ రోడ్డులో గల ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఫైర్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో శివశంకర్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో సోమవారం రాత్రి 2 గంటలకు షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి యజమానికి సమా చారమవ్వగా వారు చేరుకున్నారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వగా వారు చేరుకుని మం టలార్పే ప్రయత్నం చేశారు. నూనె ప్యాకెట్లు, క్యాన్లు ఉండడంతో మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. దాదాపు రూ.60లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

## వాలేగాంలో చోరీ

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వాలేగాం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిబాయి శనివారం తన ఇంటికి తాళం వేసి ఇలేగాం గ్రామా నికి శుభకార్యానికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండగా చుట్టు పక్కలవారు గోదావరిబాయికి తెలిపారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రూ.1.80లక్షల నగదు, 5 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

## కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కేబినెన్లో నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని దర్శించదగ్గ విషయ మని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు డా.కృష్ణంరాజు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వ ర్యంలో ప్రధాని మోదీ, రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమ సారధి ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు క్షీరాభి షేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయ కులు మాట్లాడుతూ దాదాపు తొమ్మిది దశాబ్దాల అనంతరం కులగణన చేపట్టడం చరిత్రాత్మకమ న్నారు. సత్వరమే జనాభా లెక్కలతోపాటు కులగణనను పారదర్శకంగా పూర్తిచేసి రాబోయే కాలంలో వెనుకబడిన తరగతులకు విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయపరంగా లబ్ధి చేకూరేలా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పొన్నం నారాయణ గౌడ్, రాజేశ్వర్, అశ్విన్ గౌడ్, చిట్టి బాబు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్పై దాడి చేసిన ఇద్దరిపై కేసు

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

భూ వివాదంలో హెడ్ కానిస్టేబుల్పై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్కు చెందిన కందుల రాజేశ్వర్ భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్నాడు. స్థానిక హైటెక్ సిటీకి చెందిన నల్లాల లక్ష్మీ నారాయణ, మురళి, రాజేశ్వర్ మధ్య కొంత కాలంగా భూవివాదం ఉంది. మంగళవారం భూపాలపల్లిలో విధులు ముగించుకుని రాజేశ్వర్ బస్సులో మంచిర్యాలకు వచ్చి టీటీడీ కల్యాణ మండపం వద్దదిగాడు. ఇది గమనించిన లక్ష్మీనారాయణ, మురళి రాజేశ్వర్పై దాడి చేసి గాయపరిచారు. దీంతో రాజేశ్వర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎస్టీపీపీ సందర్శించిన పర్యావరణ సలహాదారుడు మోహన్ చంద్ర

**జైపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ఎస్టీపీపీని మంగళవారం సంస్థ అటవీ, పర్యావరణ సలహాదారు మోహన్ చంద్ర పర్గెయిన్ (రిటైర్డ్ ఐఎఫ్ఎస్) సందర్శించారు. 2 టీఎంసీల రి జర్వాయర్లను పరిశీలించారు. వాటిపై ఏ ర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ను చూశారు. నీటి కుంటలు, రక్షిత అడవులను తనిఖీ చేశారు. నేల స్వభావాన్ని బట్టి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం నూత నంగా నిర్మించనున్న 800 మెగావాట్ల ప్లాంట్ స్థలాన్ని, భూమిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, డీజీఎంలు శ్రీనివాస్, అలాజుల్లాఖాన్, వాసుదేవమూర్తి, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి తదితరులున్నారు.

## నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి : డీసీపీ భాస్కర్

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

నేరాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని డీసీపీ భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్, అదృశ్యం కేసులు, ఆర్థిక నేరాలు, గుర్తు తెలియని మృత దేహాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో దొంగతనాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాతో పాటు పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. అక్కడి ప్రాంతాల ప్రజలతో మాట్లాడి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న సప్తాహం

**ఇచ్చోడ, మే 6 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలోఆరు రోజుల నుంచి సప్తాహం కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం నిర్వహిచిన కార్యక్రమంలో సునీల్కుమార్ ఆశికర్ మహరాజ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులే ప్రత్యేక్ష దైవాలని, వారిని గౌరవించాలన్నారు. మద్యపానం, మాంస హారాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ప్రవచన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తుల హాజరవుతున్నారు.

## వివాహిత బలవన్మరణం

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

హాజీపూర్ మండల కేంద్రంలో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు.. హాజీపూర్కు చెందిన బొలిశెట్టి అంజయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నా రు. 2020 డిసెంబర్ 2న పెద్ద కుమార్తె మానూషాకు పాత మంచిర్యాలకు చెందిన గురిజాల రాకేష్తో వివాహం జరిపించాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. రెండేళ్లుగా మానూషా తీవ్ర నడుము నొప్పితో బాధపడుతోంది. రెండు నెలల క్రితం నొప్పి తీవ్రం కాగా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అప్పటి నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రించగా మంగళవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చి రేకుల షెడ్డుకున్న సీలింగ్ ఫ్యాన్కు మానూషా చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. మానూషా నడుము నొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడినట్లు ఆమె తండ్రి అంజయ్య హాజీపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## భైంసాలో పోలీస్ ప్రజావాణి

### హాజరు కానున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని పాతరూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గల ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ డా.జానకీ షర్మిల పోలీస్ ప్రజావాణి నిర్వహించను న్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆమె కార్యాలయంలో అందు బాటులో ఉండనున్నారు. భైంసా సబ్ డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు నేరుగా కలిసి అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే భరోసా కేంద్రంలో సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో కోరారు.




## 'ఆరోపణలు అవాస్తవం'

**తాండూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని మిషన్ భగీరథ సూపర్ వైజర్ మోబిన్ అన్నారు. తాండూర్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ప్రారంభించినప్పటి నుండి ప్రజల కోసం 24 గంటలు పనిచేస్తున్నామన్నారు. ఇంతవరకు మాపై ఎలాంటి ఆరోపణలు లేవని వ్యక్తిగత కక్షతోనే తనపై దుష్ప్రచారం చేసి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. మిషన్ భగీరథ నూతన నల్ల కలెక్షన్ కోసం ఎవరినైనా డబ్బులు అడిగినా, ఇబ్బందులకు గురి చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

**సిర్పూర్ (టి), మే 6 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. కౌటాల, సిర్పూర్(టి) మండల కేంద్రాల్లోని గ్రంథాలయాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని గ్రంథాలయాలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కౌటాల, సిర్పూర్(టి) లైబ్రరీలకు నూతన భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## ముగిసిన పాలిసెట్ శిక్షణ




**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని డివిజన్ రిసోర్స్ సెంటర్లో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరం మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తగ్గించడానికి విద్యే అత్యుత్తమ ఆయుధమన్నారు. జిల్లాలో పేద విద్యార్థులు ఉన్నందున ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి మధుకర్, ఎంఈవో ప్రభాకర్ పాల్గొన్నారు.

## 'వారిని పంపించి వేయాలి'

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పౌరులను వెంటనే తిరిగి వారి దేశాలకు పంపాలని జిల్లా బీజేపీ అధ్యక్షులు బ్రహ్మానంద్ అన్నారు. ఈ విషయం మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షులు వేదవ్యాస్, రూరల్ అధ్యక్షులు దయాకర్, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు కేంద్రే శివాజీ, నాయకులు దినేష్ మాటోలియా, ఆకుల ప్రవీణ్, జోగు రవి, కృష్ణ ఉన్నారు.




# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### విద్యుత్ మోటార్లు, ఎత్తిపోతల పథకం మోటార్ల నుంచి రాగి తీగను దొంగిలించిన ముఠా



**కౌటాల, మే 6 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్ర సరిహద్దుల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను మంగళవారం పట్టుకున్నట్లు కౌటాల సీఐ మొత్తం రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5వ తేదీన చింతలమానపల్లి మండలం రన్నవెల్లి ఎత్తిపోతల పథకంలో గల విద్యుత్ మోటార్ల నుండి రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకు వెళ్లినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న సమయంలో మంగళవారం ఉదయం ఐదుగురు దొంగల ముఠా పట్టుబడిన తెలిపారు. సోమవారం ఎత్తిపోతల పథకంలోని రాగి తీగను దొంగిలించి తీసుకెళ్లగా తిరిగి మంగళవారం కూడా అందులోని రాగి తీగను దొంగిలించేందుకు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాకు చెందిన ఐదుగురు సభ్యుల ముఠా వచ్చింది. ప్పటికే అక్కడ కాపలాగా ఉన్న వాచ్‌మెన్ పోచయ్య అతనితో పాటు ఉన్న నలుగురు కలిసి ఈ ముఠాను పట్టుకోగా అందులో నుండి ముగ్గురు పారిపోయినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన ఇద్దరు డాన్సింగ్ గణేష్, సోలంకీలను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించగా పోలీసుల విచారణలో వారితోపాటు సతీష్ సీతారాం, రాజు సాహూ, లాజోల్ సాహూ అనే ముగ్గురు వ్యక్తులు రాగి తీగ దొంగతనానికి వచ్చినట్లు నేరం అంగీకరించినట్లు ఆయన తెలిపారు. వీరు గత నెలలో మూడుసార్లు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ వద్దకు వచ్చి రెక్కీ నిర్వహించినట్లు, అదే విధంగా గత సంవత్సరం సిర్పూర్ మండలం మండలం హుడికిలి ఎత్తిపోతల పథకంలో రాగి తీగను దొంగలించినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో వారి వద్ద నుండి 95 కిలోల రాగి తీగ, 15 కిలోల ప్లేట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు 1,25,000 ఉంటుందని, అదేవిధంగా వారి ఉపయోగించిన రెండు మోటార్ సైకిల్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సీఐ వెంట చింతలమానేపల్లి ఎస్సై నరేష్ పోలీసులు ఉన్నారు.

## విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయాలి

### కార్యకర్తల సమావేశంలో పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్, ఎండీ.అవేస్



**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

భైంసా పట్టణంలోని మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం రసా భాసగా మారింది. పీసీసీ పరిశీలకుల ముందే నేతలు, వారి అనుచరులు బాహాబాహీకి దిగడంతో గందరగోళం నెలకొంది. పార్టీలో కొత్తగా చేరినవారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు ఉండడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు వర్గీయులు వేదికపై ఉన్న పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, ఎండీ.అవేస్ దృష్టికి తెచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వర్గీయులు, పటేల్ వర్గీయుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దాదాపు అరగంటకుపైగా ఆరోపణలు, ప్రత్యారోపణలతో గందరగోళం నెలకొంది. రాష్ట్ర నేతలు కలుగజేసుకుని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సభను ద్దేశించి పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నేతల మధ్య సఖ్యత లేకనే కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాయితీపై వంటగ్యాస్ సిలిండర్, ఉచిత గృహ విద్యుత్, రైతులకు రుణమాఫీ, రేషన్కార్డుదారులకు సన్న బియ్యం వంటి హామీలు అమలు చేస్తున్నా.. గ్రూపు తగాదాలతో నియోజ కవర్గంలో పార్టీ చతికిలపడి, మూడో పార్టీ బలంపుంజుకుంటోందన్నారు. ఇప్పటికైనా నేతలు విభేదాలు వీడి పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ విధానాల ప్రకారం.. నియోజకవర్గ ఇన్చార్జి నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అందరు కలిసికట్టుగా పనిచేసి, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో బి.నారాయణ్ రావు పటేల్, జి.విఠల్ రెడ్డి, ఎస్. వేణుగోపాలచారి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, పటేల్, వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సై శ్రీకాంత్‌కు ఉత్తమ పోలీసు అవార్డు

**సారంగాపూర్, (టి), మే 6 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీస్ రియల్ హీరో అవార్డును అందుకున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా సారంగాపూర్ మండలంలో జాతీయ రహదారిలో మహబూబ్ ఘాట్ వద్ద అర్ధరాత్రి ఓ కారు అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ ప్రాణాలకు తెగించి అక్కడకు చేరుకుని క్షతగాత్రులను కాపాడారు. వారిని క్షేమంగా హాస్పిటల్‌కు చేర్చారు. శాంతిభద్రతల పరిరక్షణ, కమ్యూనిటీ పోలీసింగ్, విద్యార్థుల నేర ప్రవృత్తిని అరికట్టే కార్యక్రమాలు, మహిళల భద్రత ప్రత్యేక చర్యలు, రాత్రి వేళ గస్తీ వంటి, విధి నిర్వహణ శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధత చూపిన ఎస్సై శ్రీకాంత్‌కు అవార్డు దక్కింది.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

**జన్నారం, మే 6 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు దండేపల్లి సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆర్థిక ప్రణాళిక బడ్జెట్ కేటాయింపులు, బ్యాంకు అకౌంట్స్ రకాలు, డిజిటల్ అకౌంట్స్ రకాలు, రుణ సదుపాయం, పొదుపు సౌకర్యాలు, ఇతర లావాదేవీల గురించి దండేపల్లి కౌన్సిలర్ రవీందర్ వివరించారు. ప్రతి ఒక్కరూ నగదు పొదుపు చేసుకోవాలని సూచించారు.



# కాకా ఫ్యామిలీ అంటే కాంగ్రెస్‌కు పట్టేదారులు



### తాండూరు సమావేశంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంచలన వ్యాఖ్యలు..

**తాండూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణ సన్నాహక సమావేశాలు విస్తృతంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని తాండూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధ్యక్షతన జై బాబు, జై భీమ్, జై సమ్మిదాన్ రాజ్యాంగ పరిరక్షణ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గోవర్ ఫెడరేషన్ చైర్మన్ టీపీసీసీ పరిశీలకులు జంగా రాఘవ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాకా ఫ్యామిలీ అంటే కాంగ్రెస్‌కు పట్టేదారులని వ్యాఖ్యానించారు. గడ్డం ఫ్యామిలీ అంటే మరకలేని కుటుంబమని పేర్కొన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఏ సమయంలో అయినా మా ఇంటి తలుపు తట్టచ్చని ప్రజలకు సందేశం ఇచ్చారు. దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగ పరిరక్షణలో భాగ్యస్వామ్యం అవ్వాలి రాజ్యాంగం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందనీ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపడాలంటే ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాన్నారు. అర్హులైన నాయకులకు కచ్చితంగా పదవులు వస్తాయనీ హామీ ఇచ్చారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు రజిత, టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధికి కార్యాచరణ వేగవంతం చేయాలి






**రాజీవ్‌యువ వికాసం పథకంపై అధికారుల సమావేశంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసం పథకం పై ఆయా శాఖల అధికారులతో ఆమె సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఎకానమిక్ సపోర్ట్ స్కీమ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి ఈ నెల 20 తేదీలోగా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ ఉన్న యూనిట్లను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలనకు బ్యాంకులు వేగంగా స్పందించాలని, రోజువారి నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటి వరకు వాటి పరిశీ లన స్థితి, బ్యాంకులవారీగా టార్గెట్లు తదితర అంశా లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎల్.డి.ఎం రాంగోపాల్, మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు. ఎంపి డిఓలు, వివిధ బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రియల్ హీరోకు ఘన సన్మానం

**వృత్తిలో నిబద్ధతతోనే గుర్తింపు**

**సీఐ గోపీనాథ్‌ను సన్మానించిన ఏఎస్పీ అవినాష్ కుమార్, సిబ్బంది**



**ముథోల్, మే 6 (ప్రభాత సమాచారం)**

నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. పట్టణ సీఐ జి.గోపీనాథ్ సీఎం రేవంత్రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయనకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆయనను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్పందించి సేవలందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు కె.గణేశ్, శ్రీనివాస యాదవ్, మహమ్మద్ గౌస్, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో గ్రంథాలయాల్లోని ఖాళీల భర్తీ

**- నూతన నియామకాలు, జీతాల పెంపు**
**- రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ రియాజ్..**





**రెబ్బెన, మే 6 (ప్రభాత సమాచారం)**

త్వరలో గ్రంథాలయాల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు నియామకాలు చేపట్టడంతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది వేతనాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ రియాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, రోజువారీగా వస్తున్న పాఠకుల సంఖ్య, గ్రంథాలయంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు, యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.

**పాత స్టేషన్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి...**

మండల కేంద్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠకులు, విద్యార్థులు రాష్ట్ర చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతున్న భవనం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, మడ్డి శ్రీనివాస్, రాజేష్, అన్నాజీ, జహీరాబాబా, నాసిర్ ఉస్మానీ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




## తప్పుల తడకల లెక్కలపై

# విచారణ జరపాలి

**- స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీరుతో రైతులకు నష్టం**
**- పత్తి కొనుగోళ్లపై మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం**

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా పత్తి రైతులు నిలువునా మోసపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే హస్తంతో ప్రైవేట్ డీలర్లతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రైతులకు కుచ్చుటోపీ పెట్టారని ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే వైఖరి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 25 లక్షల మంది పత్తి రైతులు సాగు చేసిన పత్తితో 49 లక్షల పత్తి బేళ్లు ఉత్పత్తి అయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నామని అన్నారు. ఇందులో 41 లక్షల బేళ్లు సీసీఐ ద్వారా ఖరీదు చేసినట్లు చెబుతున్నారని, మరో ఎనిమిది లక్షల బేళ్లు ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు లెక్కలు ఉన్నాయన్నారు. అయితే సీసీఐ కేవలం ఆరున్నర లక్షల మంది రైతుల నుండే పత్తి కొనుగోలు చేసినట్లు ఉందన్నారు. తాను గతంలోనే హెచ్చరించిన విధంగా స్థానిక ఎమ్మెల్యే సైతం అందుకు సహకరించారని, తప్పుల తడకగా ఉన్న లెక్కలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు అశోక్ స్వామి, తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.



# అధిక కేసులు పరిష్కరించేలా చూడాలి

**ఆదిలాబాద్ జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావు**

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించేలా చూడాలని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంతో పోల్చి తే ఈసారి మరిన్ని అధిక కేసులు పరిష్కరించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకోవాలన్నారు. రాజీపడదగ్గ కేసుల కక్షిదారులతో మాట్లాడాలని సూచించారు. ఇందులో జడ్జిలు కుమార్ వివేక్, లక్ష్మికుమారి, హుస్సేన్, పీపీలు రమణారెడ్డి, రహీం, డీఎస్పీ జీవ న్రెడ్డి, వన్డేన్, టూటౌన్ సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్, ఎక్సైజ్ సీఐ విజేందర్ పాల్గొన్నారు.

# 'కులమతాలకతీతంగా బంద్‌లో పాల్గొనండి'

**చెన్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

జమ్ము కాశ్మీర్‌లోని పహిల్గంలో హిందూ యాత్రికుల మీద జరిగిన తీవ్రవాదుల దాడిని ఖండి స్తూ మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారము బందుకు పిలుపునిచ్చారు. ఈ బందుకు వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి ఉదయం 9 గంటలకు కొత్త బస్టాండ్ నుండి ర్యాలీ ప్రారంభమై పట్టణంలోని పలు ప్రధాన రహదారుల గుండా గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొన సాగుతుందని ప్రతి ఒక్కరు కూడా పాల్గొని బందును విజ యవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.